నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల
వనపర్తి



మహబూబ్‌నగర్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద..

## పోలింగ్ కేంద్రాలకు చేరిన ఈవీఎంలు..


మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు సెగ్మెంట్లకు అధికార యంత్రాంగం పోలింగ్ సామగ్రిని భారీ బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాలకు తరలించారు. కార్యక్రమాన్ని ఆయా జిల్లాల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతోపాటు కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన పరిశీలకులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు దగ్గర ఉండి సామగ్రిని తరలించారు. ఈవీఎంలు వీవీ ప్యాట్లు, ఇతర సామగ్రిని భారీ బందోబస్తు మధ్య పంపించారు. పోలింగ్ అయ్యాక ఈవీఎంలను పాలమూరు యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూంలకు తరలిస్తారు. స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చిన ఈవీఎంల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు..

ఉమ్మడి జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎండలు మండుతుండడంతో కేంద్రాల వద్ద టెంట్లు, తాగునీటి సౌకర్యం, దివ్యాంగ ఓటర్లకు వీలుగా ర్యాంపులు, ఓటు వేయడానికి వచ్చే వయోవృద్ధులకు కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు. ముందస్తు సమాచారం అందిస్తే వారికోసం వీల్‌చైర్లు ఇతర ఏర్పాట్లు కూడా చేపడుతున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటెయ్యని పరిస్థితి ఉన్న ఓటర్లకు హోం పోలింగ్ సౌకర్యాన్ని కూడా కల్పించారు. మహిళలకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు కూడా ఏర్పాటు చేశారు. ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో మోడల్ పోలింగ్ కేంద్రాలకూ శ్రీకారం చుట్టారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఇప్పటికే అధికార యంత్రాంగం అనేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించింది.

## పార్లమెంట్ బరిలో 50 మంది..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో మొత్తం 50మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు పెద్దఎత్తున ఇండిపెండెంట్లు ఈసారి రంగంలో ఉన్నారు. గతంలో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన వారికి నయానో బయానో ఇచ్చి వారిని ప్రధాన పార్టీ అభ్యర్థులు బుజ్జగించి అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకునేలా చేసేవారు. ఈసారి ప్రధాన పార్టీ అభ్యర్థులు ఎవరూ వీరిని పట్టించుకోకపోవడంతో వారంతా విత్ డ్రా చేసుకోకుండా పోటీలో నిలిచారు. మహబూబ్‌నగర్ లోక్‌సభలో పరిధిలో 31 మంది పోటీ చేస్తుండగా రెండు ఈవీఎంలను ఉపయోగిస్తున్నారు. ఒక్కో ఈవీఎంలో 16 మంది అభ్యర్థుల గుర్తులు, మరో ఈవీఎంలో 15 మంది అభ్యర్థుల సింబల్స్‌తోపాటు చివరగా నోటాను కూడా కేటాయించారు. దీంతో 32క్రమసంఖ్య కావడంతో రెండు ఈవీఎంలు ఉపయోగిస్తున్నారు. ఇటు నాగర్‌కర్నూల్ లోక్‌సభ పరిధిలో కూడా 19మంది అభ్యర్థులు రంగంలో ఉండడంతో మొదటి ఈవీయంలో 16 మంది రెండో ఈవీఎంలో నోటాతోపాటు మూడు సింబల్స్ ఉన్నాయి. దీంతో ఇక్కడ కూడా రెండు ఈవీఎంలు ఉపయోగించాల్సిన పరిస్థితి నెలకొన్నది.


మహబూబ్‌నగర్‌లో ఈవీఎంను చెక్ చేస్తున్న సిబ్బంది


నాగర్‌కర్నూల్‌లో విధులకు వెళ్తున్న సిబ్బంది




నాగర్‌కర్నూల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద సామగ్రి సరిచూసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

# ఓటేద్దాం పదా..

- నేటి పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం
- పోలింగ్ కేంద్రాలకు తరలిన ఈవీఎంలు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు ఓటింగ్

**లోక్‌సభ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానాలకు సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానున్నది. భారీ బందోబస్తు మధ్య ఓటింగ్ సరళిని జిల్లా అధికార యంత్రాంగం వెబ్‌క్యాస్ట్ ద్వారా పరిశీలించనున్నది. ఈ మేరకు పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలకు ఏర్పాటు చేశారు. ఆయా జిల్లాల్లోని సమీకృత కలెక్టర్ కార్యాలయం, పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రత్యేకంగా కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఈవీఎంలను భారీ బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాలను తరలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రెండు లోక్‌సభ సెగ్మెంట్ల పరిధిలో మొత్తం 50 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. పోలింగ్ సాయంత్రం 6గంటల వరకు కొనసాగనున్నది.**

*- మహబూబ్‌నగర్, మే 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచే పోలింగ్ ప్రారంభం కానుండగా ఈ మేరకు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అధికార యంత్రాంగం విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. భారీ బందోబస్తు నడుమ పోలింగ్ కొనసాగనుండగా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని జిల్లా అధికార యంత్రాంగం వెబ్ క్యాస్ట్ ద్వారా పరిశీలించనుంది. సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, పోలీస్ హెడ్ క్వార్టర్‌లో ఇటు పోలీస్ యంత్రాంగం, అటు రెవెన్యూ అధికారులు ప్రత్యేక కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు. లోక్‌సభ పరిధిలోని ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లకు ఆదివారం పోలింగ్ సామగ్రిని(ఈవీఎంలను) భారీ బందోబస్తు మధ్య తరలించారు. రెండు లోక్‌సభ పరిధిలో మొత్తం 50 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. మహబూబ్‌నగర్‌లో 31 మంది, నాగర్‌కర్నూల్‌లో 19 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పక్షం రోజులుగా ప్రచారం చేపట్టి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. చివరి రెండు రోజులు ఆయా పార్టీల అభ్యర్థులు ఓటర్లను పెద్దఎత్తున ప్రలోభ పెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఓటర్లు స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా విస్తృత ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే పోలింగ్ స్లిప్పులతోపాటు ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. వేసవికాలం కావడంతో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో మొత్తం ఓటర్లు 17,38,254 ఉండగా పురుషులు 8,64,875, స్త్రీలు 8,73,340, ఇతరులు 39మంది ఉన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో మొత్తం ఓటర్లు 16,80,417 ఉండగా పురుషులు 8,32,080, స్త్రీలు 8,48,293, ఇతరులు 44మంది ఉన్నారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలో 1937పోలింగ్ కేంద్రాలు, నాగర్‌కర్నూల్ లోక్‌సభ పరిధిలో 1994పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనున్నది.


వనపర్తిలోని మోడ్రన్ పోలింగ్ కేంద్రం


సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది

***పోలింగ్ సరళిపై పార్టీల అంచనాలు..***

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహించిన ప్రధాన పార్టీలు పోలింగ్ సరళిపై దృష్టి సారించాయి. ఆయా సెగ్మెంట్లలోని పోలింగ్ స్టేషన్లల్లో భారీగా అంచనాలు వేసుకుంటున్నారు. ఫలానా పోలింగ్ కేంద్రంలో తమకు లీడ్ వచ్చే అవకాశం ఉందంటూ ఇప్పటికే ఒక అంచనాకు వచ్చారు. పోలింగ్ ముగిశాక ఈ అంచనాలతో ఆయా పార్టీల అభ్యర్థులు ఓటింగ్ సరళిపై కొంతమందిని నియమించుకొని ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. ఈసారి అన్ని పార్టీలు ఓటర్లను కలవడంతోపాటు డిజిటల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించారు. ఓటర్లకు తమ వాయిస్ మెసేజ్‌లు ఒకవైపు, మరోవైపు ఆయా ప్రధాన పార్టీలు తమ అధినేతల వాయిస్‌తో మెసేజ్‌లు పంపించాయి. ఇవన్నీ ప్రచార సరళిలో భాగంగా ఓటర్లను ఆకట్టుకున్నాయి. పోలింగ్ రోజు కూడా ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు చేసుకొని ఓటర్ల నాడిని పసిగట్టేందుకు ఆయా పార్టీలు సిద్ధమవుతున్నాయి. అయితే ఓటర్లు ఎవరికి పట్టం కడతారో కౌంటింగ్ రోజున తేలనున్నది.

## బీజేపీ అభ్యర్థి భరత్‌పై ఫిర్యాదు

- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు భరత్ క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ విజయం ఖరారుతో బీజేపీ తప్పుడు ప్రచారం
- గులాబీ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి రంగినేని అభిలాష్‌రావు


విలేకరులతో మాట్లాడుతున్న అభిలాష్‌రావు

నాగర్‌కర్నూల్, మే 12 : బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై నిరాధార ఆరోపణలు చేయడం, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఉదయ్ కుమార్‌కు బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి రంగినేని అభిలాష్‌రావు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫేక్ వార్త పెట్టించారం టూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, తనపై భర త్ తప్పుడు ఫిర్యాదు చేశారని ఆరోపించారు. ఆర్ఎస్పీ విజయం ఖరారు కావడంతో బీజేపీ కుట్రలకు పాల్పడుతుందన్నారు. ఆర్ఎస్పీ కనుసన్నల్లో బీఆర్ఎస్ సోషల్ మీడియా ఫేక్ వార్తలు చేస్తుందనడం సరికాదన్నారు. మోదీ ప్రధాని అయ్యాక ఫేక్ సోషల్ మీడియా, ఫేక్ వాట్సాప్ యూనివర్సిటీ ఎవరు తీసుకొచ్చారో ప్రజలందరికీ తెలుసన్నారు. బీజేపీ నేతలే ఈ వార్తను పెడితే తెలియక బీఆర్ఎస్ అభిమానులు షేర్ చేస్తే పార్టీనే సృష్టించిందని నిరాధార ఆరోపణలు చేశారన్నారు. గురుకులాలను అడ్డం పెట్టుకొని విద్యార్థులను చెడగొడుతున్నారనడం విడ్డూరంగా ఉందన్నారు. గురుకులాల్లో సీట్లు కావాలని ఆర్ఎస్పీ కార్యాలయానికి భరత్, ఎంపీ రాములు ఎన్నిసార్లు వచ్చారు, ఎందుకు వచ్చారో చెప్పాలన్నారు. కరీంనగర్‌లో దాసరి ఉషతో డబ్బులు డిమాండ్ చేశారని ఆర్ఎస్పీపై విమర్శిస్తే చెప్పుతో కొట్టినట్లుగా ఆమె ఖండించారన్నారు. ఆర్ఎస్పీపై చేస్తున్న విషప్రచారం బీజేపీ మనువాద మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. పోలింగ్ బూతుల్లో కనీసం ఏజెంట్లు లేని బీజేపీ పార్టీకి పోటీ ఏంటని, బీఆర్ఎస్‌తో పోల్చితే బీజేపీ బలమెంత అని ప్రశ్నించారు. మోదీ, అమిత్ షా పక్కన కూర్చోగానే పెద్ద నాయకుడిలా భరత్ భావిస్తున్నారన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా సరిగ్గా 48 గంటల ముందు ఓటు వేయాలని అభ్యర్థించరాదని, భరత్ ప్రసాద్ ప్రెస్‌మీట్‌లో ఓటు వేయాలని, పార్టీ కండువాతో అభ్యర్థించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఇలాగే తప్పుడు కార్యక్రమాలు చేస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. భరత్ ప్రసాద్‌పై ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే అధికారులు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, కానీ బీఆర్ఎస్‌పై, ఆర్ఎస్పీపై నిరాధార ఆరోపణలను వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు భాస్కర్‌గౌడ్, హమీద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మాధుర్యం.. విషపూరితం!

- పండ్లను కృత్రిమంగా మాగపెడుతున్న వైనం
- ధనార్జనే ధ్యేయంగా సాగుతున్న వ్యాపారం
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికార గణం

గద్వాలటౌన్, మే 12 : పండ్లు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరం.. ఆ పండ్లలో ఎన్నో పోషక విలువలు ఉంటాయి.. సాధ్యమైనంత మేరకు పండ్లను తీసుకుంటే మంచిది.. అనారోగ్యంతో ఉన్న రోగులు పండ్లను విరివిగా తినడం ద్వారా త్వరగా కోలుకుంటారు.. ప్రతిరోజూ ఏదో ఒక పండు తీసుకోవడం మంచిదని డాక్టర్లు నిత్యం రోగులు, ప్రజలకు చెబుతున్నారు.. కానీ ఇప్పుడు అవే పండ్లు ప్రజల ఆరోగ్యానికి హానికరంగా మారుతున్నాయి.. ఎందుకంటే ఇప్పుడు అంతా కృత్రిమంగా అయ్యింది.. పండ్లను పండించడం నుంచి మాగపెట్టడం దాకా అంతా రసాయనాలమయమే అయ్యాయి.. దీంతో మాధుర్యం కాస్త విషపూరితంగా మారుతున్నది. ఆహారం ద్వారా లభించే శక్తితోనే మన జీవనయానం సాఫీగా సాగుతున్నది. ఇది అందరూ అంగీకరించే వాస్తవం. కానీ ప్రస్తుతం అరటి, సపోట, మామిడి తదితర పండ్లను మాగబెట్టే విధానాన్ని చూస్తుంటే పైమాట వాస్తవం కాదనిపిస్తుంది. పరిపూర్ణ ఆరోగ్యానికి మంచి పండ్లను తీసుకోవాలి. కానీ నేడు అసంపూర్ణ ఆరోగ్యం కోసం పండ్లను కొనుగోలు చేస్తున్నట్లు ఉన్నది. ఎందుకంటే కొందరు పండ్ల వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా కాల్షియం, కార్బైడ్ వంటి నిషేధిత రసాయనాలతో పండ్లను మాగపెట్టి విక్రయిస్తున్నారు. ఈ రసాయనం వల్ల ప్రాణాంతకమైన వ్యాధులు సంభవించే అవకాశం ఉన్నది.


***రోగాలు తప్పవు..***

రసాయనాలు కలిసిన పండ్లను తినడం ద్వారా చిన్న పిల్లలు, గర్భిణులకు ప్రాణాంతకరమైన వ్యాధులు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గర్భిణులకు గర్భస్రావం అయ్యే అవకాశాలు ఉన్నాయంటున్నారు. అందుకని రసాయనాలు కలిసిన పండ్లను కొనుగోలు చేసేటప్పుడు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.


అరటి గెలలను రసాయనంలో ముంచుతున్న దృశ్యం

### అరటి పండ్లు..

నిత్యం పిల్లలతోపాటు పెద్దవారి వరకు భోజనం తర్వాత ఇష్టంగా తినే అరటిపండు సైతం విషపూరితంగా మారింది. చిన్నపిల్లలు ఏమి తినకపోయినా ఫర్వాలేదు అరటి పండు తింటే చాలని పెద్దవారు సూచిస్తుంటారు. కానీ వారికి అరటిలో కాస్తంత విషం దాగి ఉందన్న విషయాన్ని గమనించలేక పోతున్నారు. త్వరగా పండ్లు మాగి విక్రయించి లాభించాలన్న ఉద్దేశంతో వ్యాపారులు ఇష్టానుసారంగా అరటికాయలను రసాయనం కలిపిన నీళ్లలో ముంచి మాగపెడుతున్నారు. వీటిని కొనుగోలు చేసిన ప్రజలు మాత్రం రోగాల బారిన పడుతుంటే.. దళారులు మాత్రం మూడు పువ్వులు, ఆరుకాయలుగా వ్యాపారాలు చేస్తున్నారు.



### మామిడి, సపోటలు కూడా..

పండ్లను చూస్తే వాటిని ఎప్పుడెప్పుడు తినాలా అనే ఆశ కలుగుతుంది. ఆయా సీజన్లలో మార్కెట్లో పండ్లు కనిపిస్తే చాలు కొనుగోలు చేయని వారు ఎవరూ ఉండరు. మాధుర్యంలో కూడా తనకు సాటి ఎవరు లేరని చాటుకుంటున్న ఈ పండ్లలో కాస్తంత విషం దాగి ఉన్నది. అంటే సహజంగా పండే పండ్లలో కాదండోయ్. కాయలను తెచ్చి వాటికి నిషేధిత రసాయనాలతో మాగబెట్టిన పండ్ల వల్ల చాలా అనర్థాలు ఉన్నాయి. ప్రస్తుతం మామిడి పండ్ల సీజన్ ప్రారంభమైంది. మార్కెట్‌లో ఎక్కడ చూసినా మామిడి పండ్లే కనిపిస్తున్నాయి. 30కిలోల మామిడి కాయలకు 200గ్రాముల రసాయనాన్ని కలుపుతున్నారు. మండిలో పండ్ల మధ్య అక్కడక్కడ రసాయనాన్ని ఉంచడం ద్వారా ఉదయం అయ్యేసరికి పూర్తిగా మాగిన పండ్ల మాదిరి మామిడి కాయలు మాగుతున్నాయి. పార్సిల్ చేసేటప్పుడు ముందుగానే ఆ డబ్బాల్లో రసాయనాన్ని ఉంచడం ద్వారా అవి బాగా మాగిన పండ్ల మాదిరి కనిపిస్తున్నాయి. కానీ ఇలా మాగిన పండ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండడం లేదు. అంతేకాక ఎక్కువ రోజులు నిల్వ ఉండడం ద్వారా పండ్లలో పురుగులు పడుతున్నాయి. దీంతో వాటిని తిన్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. నిషేధిత రసాయనాన్ని యథేచ్ఛగా వాడుతున్నా నియంత్రించక పోవడంపై అధికారుల పర్యవేక్షణ ఏ విధంగా ఉందో ఇట్టే అర్థం అవుతున్నది.